# పెద్దల శిక్షణ

సాయంత్రం నాలుగు గంటలు అయింది. డిసెంబర్ నెల ఆఖరి వారం. శీతాకాలం సాయంత్రం ఎండ ఆహ్లాదంగా ఉంది.

కాఫీ తాగుతూ డాబా మీద నిలబడి ఉంది రాధ. ఎన్నో ఆలోచనలు. పని మనిషి జయమ్మ రాకతో ఆలోచనలకి అంతరాయం కలిగింది.

అర గంటలో పని ముగించి తలొంచుకుని రాధ ఎదుట నిలబడింది జయమ్మ.

చిరాకు వేసింది రాధకి. ఇలా వచ్చి నిలబడిందంటే ఏదో కావాలన్న మాట.

“ఏమిటి? ఏం కావాలి?”

అమ్మగారి కంఠంలో ధ్వనించిన కోపం గమనించి వెనక్కి తగ్గింది జయమ్మ. కానీ అవసరం తనది– అడగక తప్పదు. ఆత్మాభిమానం చంపుకోక తప్పదు.

అసలు పాపం ఆ మనిషికి ఆత్మాభిమానం అంటే ఏమిటో తెలీదు. తెలిసింది రెండే. చాకిరీ చెయ్యటం, తలొంచుకుని చీవాట్లు తినడం. అందుకే మెల్లిగా అడిగింది.

“చిన్నపిల్లకి జ్వరం. చలికి చచ్చిపోతోంది పాపం, పాత సెట్టరు ఉంటే ఇవ్వండమ్మా”

రాధకు చిర్రెత్తుకొచ్చింది. “ఏమీ లేవు ఫో” కసిరి కొట్టింది.

బెదిరిపోయి దీనంగా వెళ్ళిపోయింది జయమ్మ.

రాధ మూడ్ పాడై పోయింది.

‘అలగా జనం, కాకిమూక, అలుసు ఇస్తే చాలు నెత్తి నెక్కుతారు. లేకపోతే స్వెట్టర్ కావాలట. ఇవాళ స్వెట్టర్ అడిగింది. రేపు ఫోమ్ పరుపు అడుగుతుంది. నెల

నెలా ఆరవై రూపాయలు కచ్చితంగా పుచ్చుకుంటుంది. కాఫీ టిఫిను, ఇవి గాక పాత చీరలు, దుక్కలాంటి చీర ఇచ్చి రెండు నెలలు తిరగలేదు. మళ్ళీ దేబిరింపు మొదలు. ఛీ ఛీ!'

'ఏమైనా అంటే కష్టాలు ఏకరువు పెడుతుంది. నలుగురు పిల్లలు. తిండికి లేదు. మొగుడికి ఇంకో భార్య ఉంది. వాడు డబ్బివ్వకపోతే తంతాడు. అంటూ లక్షా తొంభై రకాలుగా ఏడుస్తుంది.'

'అసలదంతా నిజమో కాదు ఎవరికి తెలుసు? అసలా పిల్లకి జ్వరం వచ్చి ఉండదు. మొన్న స్టీల్ సామాన్ల వాడికి పాత బట్టలు చూపిస్తుంటే సరిగా ఆ సమయానికే దిగబడింది. అవి చూసింది కదూ? ఆశ... ఛ, వెధవ మనుషులు!'

నాలుగున్నర కొట్టటంతో తల విదుల్చుకుని లేచింది రాధ.

పిల్లలు వస్తారు. టిఫిన్ చెయ్యాలి. చిరాగ్గానే ఆ పని ప్రారంభించింది.

టకటక బూట్లు శబ్దం చేసుకుంటూ లోపలికి వచ్చింది పన్నెండేళ్ళ శిరీష.

"అమ్మా! ఏం చేస్తున్నావ్?" అంటూ తల్లి దగ్గరకు వచ్చింది.

"పకోడీలు, పద డ్రెస్ మార్చుకుని కాళ్ళూ చేతులూ కడుక్కురా!" చెప్పింది రాధ.

"నా ఫ్రెండ్ వచ్చిందమ్మా. దాని క్కూడా ఇవ్వు పకోడీలు" అంటూ పరిగెత్తింది శిరీష.

అతిథి మర్యాదలకు అచ్చు అయ్య పోలికే. అసలు ఇంటికొస్తూ ఫ్రెండ్స్‌ని వెంట బెట్టుకు రావటం ఎందుకో. స్కూల్లో పొద్దుటి నించి కలిసే ఉన్నారుగా? సరే తీసుకొచ్చింది. వెంటనే పంపించ కూడదూ; విసుక్కుంటూనే టిఫిన్ పెట్టింది.

టిఫిన్ తిని మళ్ళీ తల్లి దగ్గరికి వచ్చింది శిరీష.

"అమ్మా నా ఫ్రెండ్‌కి అయిదు రూపాయలు కావాలట. వాళ్ళ అమ్మ ఇవ్వదుట. నే నిస్తానమ్మా" అంది ఆత్రంగా.

రాధకి ఏమీ అర్థం కాలేదు. ఆ అమ్మాయికి అయిదు రూపాయలు కావాలా? వాళ్ళ అమ్మ ఇవ్వదా? ఎందుకివ్వదు? సరే ఇవ్వదు. దీనికెందుకు మధ్యలో?

"అది కాదు శిరీ! ఎవరా అమ్మాయి? నువ్వెందుకు ఇవ్వటం?" అడిగింది అసహనంగా.

"తర్వాత చెప్తానమ్మా!" అంటూనే పరిగెట్టుకు వెళ్ళింది.

రాధ స్టౌ ఆపేసి గదిలోకి వచ్చేసరికి తన బీరువాలోంచి డబ్బు తీసుకుని వెళ్ళిపోయింది శిరీష. చూస్తుండగానే అయిదు రూపాయలు ఆ పిల్ల చేతుల్లో పెట్టేసింది.

ఆ అమ్మాయి లేచి థ్యాంక్స్ చెప్పింది.

ఇద్దరూ వెళ్ళిపోయారు.

రాధకు పట్టరానంత కోపం వచ్చింది. ఫ్రెండ్‌ని సాగనంపి హుషారుగా లోపలికి వచ్చింది శిరీష.

"ఇలా రా నువ్వు! ఈ మధ్య మరీ నిర్లక్ష్యంగా తయారవుతున్నావ్? ఎవరా అమ్మాయి? నన్నడక్కుండా, నా పర్మిషన్ లేకుండా ఎందుకిచ్చావ్? ఏం రూపాయలు మనింట్లో చెట్టుకి కాస్తున్నాయా? డబ్బు లంటే ఆటగా ఉందా నీకు? మొన్నటికి మొన్న టిఫిన్ బాక్స్ పారేసి వచ్చావు. ఇప్పుడు ఇది" విరుచుకు పడింది రాధ.

తల్లి కోపం చూసి భయపడి పోయింది శిరీష.

"అది కాదమ్మా! అది నా ఫ్రెండ్. పాపం వాళ్ళ నాన్నగారు లాస్ట్ సెప్టెంబర్‌లో చచ్చిపోయారు. వాళ్ళ అమ్మ ఏదో స్మాల్ జాబ్ చేస్తోంది. పాపం రన్నింగ్ షార్టాఫ్ మనీ"

"దీనికి ఫ్రెండ్స్, కజిన్స్ అందరూ గ్రీటింగ్స్ పంపించారట. దీనికి పంపాలని ఉందట. వాళ్ళ అమ్మని డబ్బులు అడిగితే 'నా దగ్గర డబ్బు లేదు' అందిట."

"మేము అందరం గ్రీటింగ్ కార్డ్స్ గురించి చెప్పుకుంటుంటే అది ఏడ్చింది. వాళ్ళ నాన్నగారు పాకెట్ మనీ ఇచ్చేవారుట. ఈ ఇయర్ ఆయన లేరుగా పాపం? నాకు కూడా ఏడుపొచ్చిందమ్మా. నేను, నా ఫ్రెండ్ చిత్రా కలిసి మా పాకెట్ మనీతో దానికి హెల్ప్ చేద్దాం అనుకున్నాం!" భయంగా చెప్పింది.

రాధ నిలువునా నీరై పోయింది. శక్తి అంతా ఒక్కసారి హరించుకు పోయినట్లు అయింది.

తల్లి వాలకం చూసి మరింత బెదిరిపోయింది శిరీష.

"అయాం సారీ అమ్మా. న్యూ ఇయర్స్ డే రోజున జీరో అవర్స్‌కి చాక్లెట్ కొనుక్కుంటానని చెప్పాను కదూ? అది వద్దులే అమ్మా" కంగారుగా చెప్పింది.

వెంటనే చేతులు చాపి కూతుర్ని గుండెకు హత్తుకుంది రాధ.

"సారీ తల్లీ. ఇదంతా నాకు తెలీదుగా? అందుకే కోప్పడ్డాను. నువ్వు చాలా మంచి పని చేశావ్. నీకు రెండు చాక్లెట్లు కొంటాను" అంది ఆదరంగా.

తల్లికి కోపం తగ్గిపోవడంతో శిరీషకు చాలా సంతోషం వేసింది. తూనీగలా పారిపోయింది.

రాధ మాత్రం అక్కడే కూర్చుండి పోయింది. కూతురి ప్రవర్తన పట్ల గర్వం, వెనువెంటనే ఏదో పశ్చాత్తాపం.

ఈ పాప తన బిడ్డ. తను కని పెంచి పెద్దచేసిన శిరీష. ఎంతో ఉదారంగా తన ఫ్రెండ్‌కు సాయం చెయ్యాలనుకుంది, చేసింది. అందుకోసం కావాలంటే తనకు ఎంతో ఇష్టమైన చాక్లెట్‌ని త్యాగం చెయ్యడానికి సిద్ధపడింది.

మరి తనో? జయమ్మ విషయంలో ఎంత హీనంగా వ్యవహరించింది? తనూ శిరీష వయసులో అలాగే ఉండేది. మరి వయసుతో పాటూ బుద్ధీ, జ్ఞానం పెరగాలి కదా!

మరి తనిలా తయారైంది ఎందుకు? కొరడా దెబ్బ తిన్నదానిలా లేచింది రాధ.

అలమర లోంచి పాత బట్టల మూట బయటికి తీసింది. అందులోంచి స్వెట్టరూ, రెండు గౌన్లు, ఒక చీర తీసింది. కూతురిని పిలిచింది.

"శిరీ! జయమ్మ పక్కింట్లో పని చేస్తోందేమో చూడు. ఉంటే నేను రమ్మన్నానని చెప్పు" అని చెప్పింది.

రాధ మనసులోని చిరాకు, విసుగు మాయం అయ్యాయి. మనసంతా ప్రశాంతంగా అయిపోయింది.

డాబా మీద నిలబడిన రాధ దృష్టి కింద ఆడుకుంటున్న పిల్లల మీద నిల్చింది. సర్వం మరచి కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు.

వాళ్ళ వంక తదేకంగా చూస్తుంటే రాధ పెదవుల మీద చిరునవ్వు విరిసింది. జ్ఞానోదయం, అయింది.

పిల్లలకు మంచీ చెడు నేర్పడం, క్రమశిక్షణలో ఉంచడం పెద్దల బాధ్యత. అంతటితో సరిపోదు. పిల్లల నుంచి మమతనూ, మంచితనాన్నీ నేర్చుకోవడం కూడా పెద్దవాళ్ళ బాధ్యతే!

పిల్లలు బుద్ధిగా పెరగడానికి పెద్దవాళ్ళ శిక్షణ ఎంత అవసరమో పెద్ద వాళ్ళు మంచి వాళ్ళుగా ఉండటానికి పిల్లల శిక్షణా అంతే అవసరం.

*ఆంధ్రప్రభ వారపత్రిక, 13 ఏప్రిల్, 1988*